సాక్షి నల్లగొండ

బుధవారం, 1, జనవరి, 2025




లక్ష్యం చేరుకుంటాం..


కొత్త సంవత్సరంలో ఉద్యోగం, ఉపాధి సాధనే ధ్యేయమంటున్న యువత


- గతేడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరడంలో వెనుకబాటు
- సోషల్ మీడియా వినియోగంలో తగ్గేదేలే..
- సామాజిక సేవపై మాత్రం అనాసక్తి..
- 'సాక్షి' సర్వేలో యువత మనోగతం

సాక్షి నెట్‌వర్క్ : నూతన సంవత్సర వేళ యువత మనోభావాలను తెలుసుకునేందుకు 'సాక్షి' ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా యువత నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటి అమలు.. ఈ ఏడాది ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు.. వాటి కోసం ఏర్పాటు చేసుకున్న ప్రణాళిక.. సెల్‌ఫోన్ వాడకంపై ఈ సర్వే సాగింది.









సర్వే శాంపిల్స్ ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాల నుంచి 1500 మంది 25 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సున్న యువతీ యువకులను ఈ సర్వేలో భాగస్వాములను చేశాం. వారిలో 900 మంది యువకులు, 600మంది యువతులు ఉన్నారు.

అనుకున్నది ఘనం.. అమలు స్వల్పం

గత సంవత్సరం (2024) ప్రారంభం రోజున యువత తీసుకున్న నిర్ణయాలు ఎంతో ఘనంగా ఉన్నా.. వాటిని అమలు చేయడంలో మాత్రం వెనుబడి పోయింది. ప్రత్యేకంగా లక్ష్యాలను నిర్దేశించుకోలేదని.. అనుకున్న వాటిలో కొంతమేర సాధించామని వెల్లడించారు. ఇక ఈ నూతన సంవత్సరంలో మాత్రం ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలని.. ప్రభుత్వ, ప్రైవేట్ ఏదైనా ఫర్వాలేదని చెప్పుకొచ్చారు. ఉద్యోగం సాధించలేని పక్షంలో స్వయం ఉపాధి చూసుకుంటామని దృఢంగా చెప్పడం ఆసక్తి కలిగించింది. కానీ.. సామాజిక సేవ చేయడానికి మాత్రం యువత పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇక మొబైల్‌తో గడిపే సమయం గతం (2023) కంటే ఎక్కువైందని పలువురు మొహమాటపడుతూ చెప్పారు.

మంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు



నల్లగొండ: జిల్లా ప్రజలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరంలో రాష్ట్రంలో 6 గ్యారెంటీల అమలు, కులగణన, రీజినల్ రింగ్ రోడ్డు, రైతు రుణమాఫీ, సన్న ధాన్యానికి బోనస్‌తోపాటు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా పాడిపంటలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు.

మిగిలిన సీట్లకు కౌన్సిలింగ్

నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో డీఈఈ సెట్–2024లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రధానాచార్యులు కానుగు నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాంకు సాధించి ఫేజ్–1, ఫేజ్–2లో వెబ్ ఆప్షన్ నమోదు చేసుకుని సీటు రాని అభ్యర్థులు, ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగిలిపోయిన, రిపోర్టు చేయని సీట్లలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు వెబ్ కౌన్సిలింగ్ కోసం జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. మెరిట్, రోస్టర్ ప్రకారం జనవరి 9న సీట్లు కేటాయిస్తారని, ఫ్రీ పేమెంట్, అడ్మిషన్ కేటాయింపు 9 నుంచి 13వ తేదీ వరకు జరుగుతుందని, కాలేజీల్లో రిపోర్టింగ్ చేయడానికి జనవరి 16వ తేదీ గడువు అని వివరించారు.





నల్లగొండలోని క్లాక్‌టవర్ వద్ద చర్చిలో కేక్ కట్‌చేస్తున్న క్రైస్తవులు



నల్లగొండలో తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ



న్యూ ఇయర్ జోష్‌లో యువతులు

కొత్త సంవత్సరంలోకి కోలాహలంగా..

రామగిరి(నల్లగొండ): నూతన సంవత్సరం 2025 స్వాగత వేడుకలను జిల్లా ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. పల్లెలు, పట్టణాల్లో ఉల్లాసభరిత వాతావరణం నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 2024 సంవత్సరానికి గుడ్ బై చెప్పి.. కొత్త సంవత్సరానికి కేరింతల నడుమ యువత స్వాగతం పలికారు. పెద్దలు, యువత అర్ధరాత్రి వరకు విందు వినోదాలతో వేడుకలు జరుపుకున్నారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు. రాత్రి 12 గంటల తర్వాత కేక్ కట్ చేసి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. చర్చిల్లో క్రైస్తవులు అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు.

బేకరీలు, స్వీట్ షాపుల వద్ద సందడి..

నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా బేకరీల వద్ద కేక్ కొనుగోలు చేసేందుకు వచ్చేవారితో సందడి వాతావరణం నెలకొంది. బేకరీల నిర్వాహకులు కేక్‌లపై ఆఫర్లు ప్రకటించారు. విక్రయదారులను ఆకర్షించేలా పలు రకాల కేక్‌లను తయారు చేశారు. కేక్‌లతో పాటు కూల్ డ్రింక్స్, స్వీట్ల కొనుగోళ్లు కూడా విపరీతంగా జరిగాయి.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని ఆలగడప పీహెచ్‌సీ, మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆలగడప పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండడంపై పీహెచ్‌సీ వైద్యుడు మోయిన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీతావాణిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రకాశ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ ఎందుకు నిర్మించలేదని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. తక్షణమే భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. తదుపరి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ధరణి పెండింగ్ సమస్యలపై సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ హరిబాబుతో సమీక్షించారు. అనంతరం అవంతీపురం ఐకేపీ ధాన్యం కొనుగోలు



ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేంద్రాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. జిల్లా వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి సంబంధిత ఏఈఓను అవంతీపురం పిలిపించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాల ఆధారంగా వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో డెలివరీల సంఖ్య 400కు పెంచేలా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌నమరద్‌కు సూచించారు.

విద్యార్థినులు కష్టపడి చదవాలి

విద్యార్థినులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. బోర్డుపై గణితం లెక్కలు వేసి విద్యార్థినుల నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యాబోధన, భోజనం ఎలా ఉందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలోని వంట గదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారిని ఆదేశించారు.



గణితం బోధిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, ఎంఈఓ బాలు తదితరులు పాల్గొన్నారు.

రాత పరీక్షలు వాయిదా

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో టైపిస్టు (అసిస్టెంట్), రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలకు జనవరి 4న జరగాల్సిన రాత పరీక్షలు జనవరి 18వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు తెలిపారు. ఓఎమ్ఆర్ పద్ధతిలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రికార్డు అసిస్టెంట్ పరీక్ష ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు, టైపిస్టు(అసిస్టెంట్) పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.40 వరకు జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు www.nalgonda .ecourt.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఎన్ఎస్‌పీ ఈఈ లక్ష్మణ్‌బాబు సస్పెన్షన్

మిర్యాలగూడ : మిర్యాలగూడ ఎన్ఎస్‌పీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మణ్‌బాబును సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. లక్ష్మణ్‌బాబు స్థానికంగా అందుబాటులో ఉండడం లేదని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, లిఫ్ట్ పనులపై దృష్టి సారించడం లేదని మంత్రికి పలు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సైతం ఫిర్యాదు చేశారు. దీంతో హైదరాబాద్ జలసౌధలో జరిగిన నల్లగొండ పార్లమెంటరీ ఇరిగేషన్ సమీక్ష సమావేశంలో ఈఈ లక్ష్మణ్‌బాబుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేశారు.

3,4 తేదీల్లో సైన్స్ ఫెయిర్

నల్లగొండ: జిల్లా స్థాయి సైన్స్ మేళా–2024 ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌పై వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని 9848578845 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పోలీసులకు 'ఉత్తమ' పతకాలు

నల్లగొండ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకాలను ప్రకటించింది. విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలందించినందుకుగాను.. ఈ పతకాలకు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్‌శాఖ నుంచి రాష్ట్ర పోలీస్ మహోన్నత సేవా పతకానికి ఇద్దరు, ఉత్తమ సేవా పతకానికి ఇద్దరు, సేవా పతకానికి 21 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

పతకాలు పొందినవారు ఇలా..

మహోన్నత సేవా పతకం

1. జె.సురేందర్, హెడ్‌కానిస్టేబుల్, భువనగిరి
2. ఎం.అశోక్, ఆర్ఎస్ఐ, నల్లగొండ

ఉత్తమ సేవా పతకం

1. ఎం.వెంకటేశ్వర్లు, ఏఆర్ఎస్ఐ, డార్ సూర్యాపేట
2. జి.రమేష్, డీఎస్పీ, స్పెషల్ బ్రాంచ్, నల్లగొండ

సేవా పతకం

1. సీహెచ్.శివకుమార్, ఏఆర్ఎస్ఐ, భువనగిరి
2. వి.నాగార్జున, ఏఆర్ఎస్ఐ, భువనగిరి
3. ఎండీ.ఇక్బాల్ పాష, ఏఆర్ఎస్ఐ, భువనగిరి
4. డి.నాగరాజు, ఏఆర్ఎస్ఐ, భువనగిరి
5. ఎం.శ్రీనివాసులు, ఏఆర్ఎస్ఐ, భువనగిరి
6. పీవీ శ్రీనివాసులు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, భువనగిరి
7. ఎస్.శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్, రామన్నపేట పోలీస్‌స్టేషన్
8. ఎం.నాగేశ్వర్‌రావు, అడిషనల్ ఎస్పీ, సూర్యాపేట
9 ఎం.వెంకటనారాయణ, ఏఆర్ఎస్ఐ, సూర్యాపేట
10. పి.వెంకటేశ్వరరావు, ఏఆర్ఎస్ఐ, సూర్యాపేట
11. ఎండీ.శంషీర్‌ఖాన్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట
12. పి.వెంకటయ్య, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట
13. ఎండీ.ఖలీలుల్లాఖాన్, ఎస్ఐ, ఆర్టీసీ నల్లగొండ
14. పి.శేఖర్, ఏఎస్ఐ, రూరల్ పోలీస్ స్టేషన్, నల్లగొండ
15. బి.రవిప్రసాద్, ఏఎస్ఐ, డీటీసీ నల్లగొండ
16. జె.వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ, రూరల్ పోలీస్‌స్టేషన్ నల్లగొండ
17. పి.రవికుమార్, ఏఎస్ఐ, ఏఆర్, నల్లగొండ
18. ఎ.యాదగిరిరెడ్డి, ఏఆర్ఎస్ఐ, నల్లగొండ
19. బి.మోహన్‌రావు ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, నల్లగొండ
20. కె.శ్రీనివాసరావు, ఏఆర్ఎస్ఐ, 12వ బెటాలియన్, టీజీఎస్పీ అన్నెపర్తి, నల్లగొండ
21. వై.ప్రతాప్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్, ఇంటలిజెన్స్, నల్లగొండ జోన్

యాదగిరిగుట్టలో ప్రత్యేక ఏర్పాట్లు



విద్యుత్ కాంతుల వెలుగుల్లో యాదగిరిగుట్ట ఆలయం

యాదగిరిగుట్ట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు అధికంగా రానున్న నేపథ్యంలో ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో వేకువ జామునే స్వామివారికి సుప్రభాతం, అభిషేకం, సహస్రనామార్చన వంటి పూజలు పూర్తిచేసి, 7గంటలకు భక్తులకు దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు మంగళవారం ‘సాక్షి’కి వెల్లడించారు. భక్తులకు రద్దీకి అనుగుణంగా లడ్డూ, పులిహోర ప్రసాదాలను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానాలయ ముఖ మండపం, గర్భాలయ ముఖ ద్వారం వంటి ప్రాంతాల్లో పూలు, అరటి తోరణాలతో అలంకరించారు. కొత్త ఏడాది మొదటి రోజు సుమారు 70వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు ఈఓ చెప్పారు. వీఐపీలు వస్తే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశాలను ఇప్పటికే అధికారులకు సూచించామన్నారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించామన్నారు.

నేటి నుంచి ప్రత్యేక దర్శనం..

యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లల తల్లులకు బుధవారం నుంచి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి 11.30గంటల మధ్యలో, సాయంత్రం బ్రేక్ దర్శనం పూర్తయిన తర్వాత 5గంటల నుంచి 5.30గంటల సమయంలో దివ్యాంగులు, చంటిపిల్లలు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం చేయిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూర్పు ద్వారం ముందు ప్రత్యేక షెడ్డులో కూర్చోబెట్టి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు.

ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

చౌటుప్పల్: జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు ఆదేశించినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో మంగళవారం ఐద్వా జిల్లా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయం, ఆహార భద్రత, పౌష్టికాహార పంపిణీ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టిసారించాలన్నారు. నిత్యావసర ధరలను తగ్గించాలన్నారు. ఈ అంశంపై వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టనున్నామని, ఇందులో వెల్లడైన అంశాలతో కూడిన నివేదికను ఆయా జిల్లాల కలెక్టర్లకు అందజేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, కల్లూరి నాగమణి, మల్లేపల్లి లలిత, అండాలు, శారద, సోని, సువర్ణ, లక్ష్మమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

‘రీజినల్’ భూనిర్వాసితులకు అండగా నిలుస్తాం

- రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్



కె. లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

చౌటుప్పల్: రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు మంగళవారం కె. లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎలాంటి భూసేకరణ జరగకముందే టెండర్లు అంటూ తమను భయబ్రాంతులకు గురిచేస్తున్నారని భూనిర్వాసితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి 40 కిలోమీటర్ల దూరంలో రీజినల్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలనే నిబంధనను తుంగలో తొక్కారని ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్డు మూలంగా చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ మున్సిపాలిటీలు ముక్కలుముక్కలుగా మారుతున్నాయని తెలిపారు. కొంతమంది వ్యక్తులతో పాటు పరిశ్రమల కోసం వందలాది మంది రైతులు, పేద ప్రజలను రోడ్డుపాలు చేయొద్దని వేడుకున్నారు. ఈ సందర్భంగా కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులకు ఇచ్చేందుకు నిర్ణయించిన పరిహారం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలను పోల్చి పరిహారం ఇవ్వడం సమంజసమన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భూనిర్వాసితుల సంఘం కన్వీనర్, స్థానిక సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, ప్రతినిధులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దబ్బటి రాములు, సందగళ్ల మల్లేష్‌గౌడ్, జాల వెంకటేష్, జాల శ్రీశైలం, పంకర్ల యాదయ్య, జాల మైసయ్య, జాల నర్సింహ, వల్లూరి బోవయ్య, జాల జంగయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

32 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిలుకూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. చిలుకూరు ఎస్ఐ రాంబాబుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన చిట్టిప్రోలు సీతాపతి ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ చేసి ఆంధ్రాకు తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు సీతాపతి ఇంటి వద్దకు వెళ్లగా.. మినీ ట్రావెల్లర్ బస్, స్కార్పియో కారులో రేషన్ బియ్యం లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. నారాయణపురం గ్రామానికి చెందిన కందుకూరి కోటయ్య, కందుకూరి శ్రీను, చడపంగు వెంకటేశ్వర్లుతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడుకు చెందిన కుంభ కోటేశ్వరరావు, పాలపతి వెంకటేశ్వరరావు, చెవుల శ్రీను, వెంకటనాగేశ్వరరావు, తాతిరెడ్డి అంజితరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తం 64 బస్తాల్లోని 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కోదాడ సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు వివరించారు. కోదాడ సివిల్ సప్లై అధికారి రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.